


అంత్యక్రియలకూ అష్టకష్టాలే!


మృతదేహంతో ఏటిని దాటాల్సిన దుస్థితి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో అంత్యక్రియలకూ అష్టకష్టాలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికీ చాలా గ్రామాలలో మృతి చెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించాలంటే పది అడుగుల నీరు ప్రవహిస్తున్న ఏటిని దాటాల్సిన దుస్థితి ఏర్పడింది..మండలంలోని ఉదయ మాణిక్యం పంచాయతీ పుట్టావాండ్లపల్లి గ్రామం హరిజనవాడకు చెందిన చిన్నస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహానికి అంత్యక్రియలు నిమిత్తం శ్మశానానికి తీసుకెళ్లాలంటే చుట్టుపక్కల అగ్రవర్ణాల వారి భూములు తప్ప దళితులకు భూములు లేకపోవడంతో దళితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందితే శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో వర్షాకాలంలో పది అడుగుల లోతులో పారుతున్న గాజులేరు దాటి అంత్యక్రియలు చేయాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందని కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గానుగ చింత నుండి బాకరాపేట వైపు వెళుతున్న రోడ్డు మార్గం పూర్తిగా పాడైపోవడంతో శ్మశానానికి దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తులు అనేకసార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు అర్జీలు సమర్పించుకున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి వంతెన నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని గ్రామస్తు లు కోరుతున్నారు.

మహాసభల సంరంభం


పతాకావిష్కరణ


మహా సభలు ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస రావు

- ఉద్యమాలకు ఉత్తేజం
- అదానీ కుంభకోణంపై.. మోడీ పెదవి విప్పాలి
- విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి
- రాయలసీమ జిల్లాలకు నిధులు ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/సత్యవేడు

ప్రపంచాన్ని కుదిపేస్తున్న సోలార్ విద్యుత్ కుంభకోణంపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ పెదవి విప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కుంభకోణంలో అదానీతో పాటు మోడీ, జగన్, చంద్రబాబులకు వాటా ఉందని ఉద్ఘాటించారు. తూర్పు దిక్కు ఉద్యమాల గడ్డ సత్యవేడులో సిపిఎం 14వ జిల్లా మహాసభలు ఉత్సాహంగా, చైతన్య స్ఫూర్తితో ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. జోరు వాన కురుస్తున్నా కదం తొక్కుతూ, పదం పాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ వరకు ముందుకు సాగారు. ప్రజా నాట్య మండలి, జానపద వృత్తి కళాకారుల డప్పు వాయిద్యాల మధ్య ముఖ్య అతిధులు బహిరంగ సభా ప్రాంతం వద్దకు చేరుకున్నారు. అరుణ పతాకాల రెపరెపలతో ఆ ప్రాంతంతో పాటు సత్యవేడు ఎరుపెక్కింది. సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించారు. ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. తిరుపతి జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల భవిష్యత్ పోరాటాల తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం బహిరంగ సభనుద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడారు. డబ్బు, కులం, కుటుంబ పాలనలాంటి అంశాలు ఈ రోజుల్లో అధికారాన్ని, నాయకులను తయారు చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా తారతమ్యాలకతీతంగా నాయకత్వాన్ని ఎంపిక చేస్తున్న పార్టీ సీపీఎం అన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలను కోరుకుంటున్నారనీ భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఓ కీలక వ్యక్తికి సోలార్ విద్యుత్ కుంభకోణంలో రూ.1700కోట్లు ముట్టాయని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తున్నా మోడీ, చంద్రబాబులు ఎందుకు విచారణ జరపడంలేదని ప్రశ్నించారు. తాను మోడీ చెప్పినట్లు చేశానని జగన్, మోడీ చెప్పకుండా తానేమీ చేయలేనని చంద్రబాబులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అదానికి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు.

మోడీ పాలనలో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు 8 నుంచి 3 శాతానికి పడిపోగా నిత్యావసర ధరలు మాత్రం 8 నుంచి 16 పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.16వేల కోట్ల భారం మోపినా అడిగే దిక్కులేదన్నారు. డిసెంబర్ 1 నుంచి చార్జీల వడ్డనకు పూనుకుంటున్న నేపథ్యంలో వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని హెచ్చరించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి కేంద్రం బడ్జెట్ నయా పైసా కేటాయించలేదని మండిపడ్డారు. తిరుపతి జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేందుకవసరమైన తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. మన్నవరం బెల్ పరిశ్రమను పునరుద్దరించాలని కోరారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి పన్ను పెంపును రద్దుచేయాలన్నారు. దశల వారీ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను నిలువరించాలని డిమాండ్ చేశారు. అధిక ధరల తో నియంత్రణతోపాటు, కార్మికుల వేతనాలను రూ.26 వేలకు పెంచాలని కోరారు. పులికాట్ సరస్సును అభివృద్ధి పరచి, మత్స్యకారులకు బాసటగా నిలవాలని చెప్పారు. చేనేత, పవర్ ల్యూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గం విద్య, వైద్యం, వ్యవసాయం పరంగా వెనకబడిందన్నారు. శ్రీసిటీ సెజ్‌లోని 200పరిశ్రమల్లో 6వేల మంది కార్మికులు పనిచేస్తున్నా సరైన వేతనాలు, పిఎఫ్ సౌకర్యాలు అందడం లేదని వాపోయారు. మాన్ పవర్ కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. సత్యవేడులో ఉన్న రెండు గురుకులాలు దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకైక డిగ్రీ కళాశాలను మరో ప్రాంతానికి తరలించే కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. అరణియార్, ఉబ్బలమడుగు ప్రాజెక్టులున్నా సాగునీటి కరువును తీర్చుకోలేని దుస్థితిలో తూర్పు మండలాల రైతులున్నారని వాపోయారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, సీపీఎం నాయకులు రమేష్, సుబ్రమణ్యం, సాయి లక్ష్మీ, జయ చంద్ర, హరినాథ్, మాధవ్, వెంకటేష్, అరుణాచలం, శివకుమార్, గంధం మణి, అల్లెయ్య, వేణు, భగత్, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.


సీనియర్లకు సన్మానం

'దీపం' కోసం నిరీక్షణ

- బ్యాంకు ఖాతాలో పడని రాయితీ సొమ్ము
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దీపం కనెక్షన్‌లు వున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ గ్యాస్ సిలిండర్ నగదు జమ కాక లబ్ధిదారులు పలువురు నిరీక్షిస్తు న్నారు. ప్రభుత్వం జమ చేసినట్లు ఫోన్లకు సమాచారం అందినా బ్యాంకుల ఖాతాలకు జమ కాకపోవడంతో బ్యాంకు ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నారు.

తిరుపతి అర్బన్ పరిధి లోని భవాని నగర్ నివసిస్తున్న సుధారాణి ఇండేన్ సర్వీస్ గ్యాస్ ఏజెన్సీ నుంచి నవంబరు 20న యథావిధిగా రూ.850 చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకున్నారు. వినియోగదారుని నెంబరు ఆధార్, ఫోన్ నెంబరును బ్యాంకు ఖాతాకు అనుసంధానంతో ఈకెవైసి చేసుకున్నారు. అయినా డిసెంబర్ ఒకటవ తేదీ వరకు ఆమె బ్యాంకు ఖాతాలో రాయితీ సొమ్ము జమకాలేదు. గతంలో వలే రూ.3.90 పైసలు జమైనట్లు ఆమె ఫోన్ నెంబరు సమాచారం వచ్చింది. తనకు ఉచిత గ్యాస్ రాయితీ సొమ్ము పడని విషయం ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని సుధారాణి వాపోయింది. ఈమె వలే గ్యాస్ రాయితీ సొమ్ము జమ కాని వారు అనేక మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీ సొమ్ము 'మీ అకౌంట్లో వేస్తామని పదే పదే ప్రకటించింది. గత పది రోజులు నుంచి బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నా రాయితీ సొమ్ములు పడడం లేదని, అర్హులైన వారు రాయితీ సొమ్ము కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇటు సివిల్ సప్లై అధికారులు సైతం లబ్ధిదారులకు సరైన సమాధానం చెప్పడం లేదు. వారిపై విసిగిపోతున్నారు. దీపం-2 పథకం అమల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. ఈకెవైసి చేసుకున్నా లబ్ధిదారు లందరికీ రాయితీ సొమ్ము జమకావడంలేదు. టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసినా పరిష్కారం కావడం లేదు. సిలిండర్ అందిన కొద్ది రోజుల వ్యవధిలో కొందరి ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. కొందరికి వారం రోజులు పడుతోంది. ఈశ్వరరావు వలే కొందరికి రెండు వారాలవుతున్నా రాయితీ సొమ్ము జమ కావడంలేదు. సకాలంలో డబ్బులు జమ కాకపోవడంతో ఉచిత గ్యాస్ తమకు వర్తించదన్న ఆందోళనలో లబ్ధిదారులున్నారు. గ్యాస్ రాయితీ సొమ్ము జమ కాక నిరాశ చెందుతున్నారు. సిలిండర్ అందిన 48 గంటల్లో రాయితీ సొమ్ము ఖాతాలో జమ అవుతుందని ప్రభుత్వం చెప్పింది. కానీ, అమల్లో ఇంకా లోపాలు కొనసాగుతున్నాయి. ఫిర్యాదు చేసినా ఫలితం కన్పించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఏడాదిలో నాలుగు నెలలకు ఒకటి చొప్పున మూడు సిలిండర్లు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. అందులో భాగంగా తొలి దశలో సిలిండరుకు రాయితీ సొమ్ము రాకపోవడంతో మిగిలిన రెండు సిలిండర్లకు డబ్బులు రావన్న నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో .4లక్షల 92, వేల302 మంది అర్హులు ఉన్నారు. ఇందులో 41 ఏజెన్సీలు ఉన్నాయి. వీరిలో దీపం, ఉజ్వల-1, ఉజ్వల-2, సిఎస్ఆర్ (స్త్రీ), సాధారణ కేటగిరీలో గ్యాస్ కనెక్షన్ పొందిన 3.60 లక్షల మందిని ఉచిత గ్యాస్ పొందడానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. ఇప్పటికి 1.37 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండరును బుక్ చేసుకున్నారు. గ్యాస్ రాయితీ సొమ్ము రూ.807లు తమ ఖాతాలో జమ అయినట్లు సమాచారం రాక రోజూ బ్యాంకులకు వెళ్లి రాయితీ సొమ్ముపై అడిగి తెలుసుకుంటున్నారు. అయితే అధికారులు మాత్రం సిలిండర్ తీసుకున్న వారందరికీ రాయితీ సొమ్ము జమవుతుందని చెబుతున్నారు. ఈ పరిస్థితిలో లబ్ధిదారులు ఆందోళనలో పడ్డారు.

ఎస్వియూలో అంధకారం!

క్యాంపస్ : ఫెంగల్ తుపాను నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎస్వీయూలో పలుచోట్ల కరెంటు తీగలు తెగి పడిపోయాయి. అనేక చోట్ల వృక్షాలు, కొమ్మలు నేలకొరిగాయి. వర్సిటీలో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పూర్తిస్థాయిలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 8 గంటలకు కావస్తున్నా కరెంటు పునరుద్ధరించడం వీలు కాకపోవడంతో విద్యార్థులు, పరిశోధకులు, క్వార్టర్స్ లలో నివసించే సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్సిటీలో కరెంట్ పనిచేసే సిబ్బంది కొరతగా ఉండడం, ప్రధాన ఇంజనీరు, ఉప ఇంజనీర్ చరవాణి సరిగా పనిచేయకపోవడం సమస్యలను చెప్పేందుకు వారు అందుబాటులోకి రాకపోవడం విద్యార్థులు, సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.


ఎస్వియూ క్యాంపస్ ఆవరణలో నెలకొన్న అంధకారం

విద్యుత్ విభాగంలో పనిచేసే సిబ్బంది, అరకొర వేతనాలతో రెండు రోజులుగా కరెంటు పనులు పునరుద్ధరించే పనిలో కృషి చేస్తుండగా, మరోవైపు టెలిఫోన్ వైర్ లాగే ఒక వ్యక్తి కరెంటు పోల్ పై పడటంతో భయభ్రాంతులకు గురైన కరెంటు సిబ్బంది అతన్ని కాపాడారు. ప్రమాదం వెనుక ప్రమాదం అంటూ వర్సిటీలోని సి బ్లాక్ కేంద్రం వద్ద ఉన్నటువంటి కరెంటు తీగలు స్పార్క్ కు గురై పెద్ద ఎత్తున మండిపోయాయి. దీన్ని పునరుద్ధరించడానికి అదనపు సిబ్బంది, ఏపీఎస్పీడీసీఎల్ కు చెందిన కరెంట్ సిబ్బంది అవసరమని వర్సిటీలో పనిచేసే కరెంటు సిబ్బంది వెల్లడించారు. అతి తక్కువ సిబ్బందితో పని చేసే కరెంటు విభాగంలోని ఉద్యోగులు ఎంతో కష్టపడి పరిపాలన భవనం, బాలికల వసతి గృహాలు, వర్సిటీ పడమర ప్రాంతం వైపు కరెంటు వచ్చేలా కృషి చేశారు. అయితే బాలుర వసతి గృహాలు ముఖ్యంగా ఆరోగ్య కేంద్రం చుట్టూ పరిసరాలలో నివసించే ఉద్యోగులకు కరెంటు అందకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో పాములు, పురుగులు, ఇతర క్రిమి, కీటకాల ద్వారా ఎలాంటి ఆపద వస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణ వెంటనే స్పందించి సకాలంలో రాత్రి లోపల కరెంటు సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వాన గండంగా మారిన వాయుగుండం

- ఆగని ముసురు వాన
- కూలిన స్తంభాలు.. ఆగిన విద్యుత్
- ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- పలు చోట్ల స్పందించని అధికారులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: అల్ప పీడన ప్రభావంతో గత మూడు రోజులుగా మండలంలో ఓ మోస్తరు వర్షాలు పడుతుండగా శనివారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. మండలంలోని కుక్కంబాకం, పల్లమాల, కనమనంబేడు, పెద్ద పాలివేడు, చిన్నపాలివేడు గ్రామాలలోని చెరువులతో పాటు పలు గ్రామాల చెరువులు, కలుజులు పారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి పంటలు నీట మునిగాయి. మరో రెండు రోజుల పాటు ఈ తుపాను ప్రభావం ఉండటంతో అధికారులు అప్రమత్తమై సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించేందుకు సంసిద్ధ మయ్యారు. తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పోలీస్, ఆరోగ్య, మండల అభివృద్ధి అధికారులతో పాటు ఇరిగేషన్ తదితర శాఖలకు చెందిన అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి విపత్తులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎవరైనా ముంపునకు గురి అయ్యే ప్రమాదం ఉంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. స్థానిక విద్యుత్ ఏఈ చలపతి మాట్లాడుతూ ఫెంగల్ తుపాన్ ప్రభావంతో గాలికి నేలకొరిగిన స్తంభాలను సరిచేస్తూ విద్యుత్ అంతరాయం లేకుండా తమ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నారని తెలిపారు. కుక్కంబాకం గ్రామానికి చెందిన కారికాటి గంగయ్య రేకుల ఇంటిపై సమీపంలో ఉన్నచెట్టు తిరిగి ఇంటిపై పడటంతో రేకులు ఇల్లు కూలిపోయింది. ఇంటిలో ఉన ఆహారం, గృహోపకరణాలు, దుస్తులు నీట మునిగాయని బాధితుడు వాపోతున్నారు.

మూడు రోజులు కురుస్తున్న వర్షాలు ఆదివారం కూడా వీడలేదు. ఈ కారణంగా జిల్లాలో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. చెరువులు నీటితో నిండి కళకళలాడు తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గ్రామాల ప్రజలు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు కారణంగా దాటలేక దుర్భర స్థితి ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలు కూల డం తో కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.


బిఎన్ కండ్రిగలో నీట మునిగిన వరిపైరు

చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టం

పుత్తూరు టౌన్ : నైరుతి బంగాళాఖాతంలో ఫెంగల్ తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా రూరల్ మండలంలో సిరుగురాజుపాలెం గ్రామ పంచాయతీలో పొట్టిగుట్టల సమీపంలో ఉన్న అండర్ బ్రిడ్జి పూర్తిగా నీళ్ల నిలిచిపోవడంతో దిగువగూళ్లూరు, ఎగువ గూళ్లూరు ప్రజలకు రాకపోకలు ఏర్పడి అంతరాయం ఏర్పడి ఆగిపోయాయి. రోడ్డు పక్కన పెద్ద వృక్షం కూలిపోయి విద్యుత్ స్తంభంపై పడ్డాయి. దీంతో రెండు రోజులుగా కరెంటు లేక ప్రజలు విలవిలలాడుతున్నారు. తాగడానికి నీళ్ల కరువయ్యాయి. దోమలు ఎక్కువ చేరడంతో ప్రజలు ఇబ్బందులు గురి అవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసి ప్రజలకు విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జలదిగ్బంధంలో గ్రామం

పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని జీలపాటూరు గ్రామ పంచాయతీలోని దొడ్లవారిమిట్ట గ్రామం చుట్టూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇరవై కుటుంబాల వారు జలదిగ్బంధంలో ఇరుక్కుని అల్లాడుతున్నారు. నేషనల్ హైవే పనులు ప్రారంభమైనప్పటినుండి వర్షం పడుతున్న ప్రతి సారి ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది. దీనికి కారణం నేషనల్ హైవే 71 రోడ్డు వాళ్లు నీళ్లు వెళ్లేందుకు కాలువను, సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం నీళ్లు వెళ్లే కాలువను పూడ్చివేయడం వల్ల వర్షపునీరు ఇళ్ల మీదికి వస్తున్నాయి.ఆర్అండ్‌బి వారు వెంటనే సిమెంట్ కాలువ నిర్మించి నీటిలో మునిగివున్న పేదలను ఆదుకోవాలని కోరుతున్నారు.


పుత్తూరులో కూలిన విద్యుత్ స్తంభం

వాతావరణ సంక్షోభంపై అప్రమత్తంగా ఉండాలి

- వాతావరణ పరిశోధన విశ్లేషకులు ఆచార్య ఎస్ విజయ భాస్కరరావు

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి - క్యాంపస్ : వాతావరణ సంక్షోభం పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వాతావరణ పరిశోధన విశ్లేషకులు ఆచార్య ఎస్ విజయ భాస్కరరావు అన్నారు. హీట్‌వేవ్ అనేది అసాధారణంగా వేడిగా ఉండే పగలు, రాత్రుల క్రమంలో స్థానిక అదనపు వేడి పేరుకుపోయే కాలం అని, వాతావరణ మార్పుల కారణంగా వేడి తరంగాలు, సుదీర్ఘమైన అదనపు వేడి పరిస్థితులు ఫ్రీక్వెన్సీ, వ్యవధి, తీవ్రత, పరిమాణంలో పెరుగుతున్నాయి. తక్కువ, మితమైన తీవ్రత వేడి తరంగాలు కూడా జనాభా ఆరోగ్యం, శ్రేయస్సుపై ప్రభావం చూపుతాయని భౌతిక శాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులు, వాతావరణ పరిశోధన విశ్లేషకులు ఆచార్య ఎస్ విజయభాస్కరరావు పేర్కొన్నారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే వేడి తరంగాలు తక్షణ చర్య, నివారణ వంటి పలు అంశాలపై ఆయన 'ప్రజాశక్తి'తో తన అభిప్రాయాలు పంచుకున్నారు.

ప్రశ్న: వేడి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

సమాధానం: పర్యావరణ ఉష్ణ ఒత్తిడి (ఉదాహరణకు, అధిక ఉష్ణోగ్రత, అధిక తేమ, తక్కువ గాలి, అధిక ఉష్ణ వికిరణం) కారణంగా జీవక్రియ ప్రక్రియల నుండి అంతర్గతంగా ఉత్పత్తి చేసిన వేడిని తొలగించడంలో అసమర్థత, కలయిక ద్వారా మానవ శరీరంలో నిల్వ చేసిన వేడి మొత్తం నిర్ణయిస్తుంది. వేడి నష్టానికి అడ్డంకిని సృష్టించే దుస్తులు, పర్యావరణం నుండి బాహ్య ఉష్ణ లాభం, అలాంటి పరిస్థితులలో అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించడంలో, వేడిని తగ్గించడంలో శరీరం అసమర్ధత వేడి అలసట, హీట్‌స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. శరీరాన్ని చల్లబరచడానికి ప్రయత్నించినప్పుడు కలిగే ఒత్తిడి గుండె, మూత్రపిండాలను కూడా ఒత్తిడి చేస్తుంది. ఫలితంగా, వేడి తీవ్రతలు దీర్ఘకాలిక పరిస్థితుల (హృద్రోగ, మానసిక, శ్వాసకోశ , మధుమేహ సంబంధిత పరిస్థితులు) నుండి ఆరోగ్య ప్రమాదాలను మరింత తీవ్రతరం చేస్తాయి. తీవ్రమైన మూత్రపిండాల గాయానికి కారణమవుతాయి.

ప్రశ్న: వేడి వాతావరణం వల్ల సంభవించేవి ఏమిటి?

సమాధానం: తీవ్రమైన వేడి వాతావరణం కారణంగా సంభవించే మరణాలు, ఆసుపత్రిలో చేరడం వేగంగా వుంటాయి. (అదే రోజు , తర్వాతి రోజులు), అంటే హీట్ అలర్ట్ జారీ చేసినప్పుడు జోక్యం వేగంగా వుండాలి.

ప్రశ్న: ప్రస్తుత ప్రభావాల స్వభావం, వేడి తీవ్రత దేనిపై ఆధారపడి వుంటుంది?

సమాధానం: వేడి ఆరోగ్య ప్రభావాల స్థాయి, స్వభావం వేడి సంఘటన సమయం, తీవ్రత, వ్యవధిపై ఆధారపడి ఉంటుంది. స్థానిక జనాభా, మౌలిక సదుపాయాలు, సంస్థలు ప్రస్తుత వాతావరణానికి అనుకూలించే స్థాయి, అనుకూలతపై ఆధారపడి ఉంటాయి.

ప్రశ్న: ప్రస్తుత పరిణామాల వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితులు వుంటాయి?

సమాధానం: 2024లో, భారతదేశం వినాశకరమైన హీట్ వేవ్‌ను ఎదుర్కొంది. ఇది వందల కొద్దీ మరణాలు, వేల సంఖ్యలో హీట్‌స్ట్రోక్ కేసులకు కారణమైంది. జూన్, 2024 నాటికి 33 మంది ఎన్నికల విధులు పనిచేసే సిబ్బందితో సహా 219 మంది హీట్ వేవ్ నుండి మరణించారు. ఏది ఏమైనప్పటికీ డేటా సేకరణ, ప్రతిస్పందన వ్యవస్థలు సరిపోకపోవడం వంటి కారణాల వల్ల వాస్తవ మరణాల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని కొందరు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. భారత ప్రభుత్వం వేడి సమయంలో 40,000 హీట్‌స్ట్రోక్ కేసులను నివేదించింది.

ప్రశ్న: వాతవరణ మార్పులు ఎలా వుంటాయి?

సమాధానం: భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు 50 సెంటీగ్రేడ్ (122 ఫారన్‌హీట్)కి చేరుకున్నాయి. ముఖ్యంగా ఢిల్లీ అత్యంత వెచ్చని రాత్రిని నమోదు చేసింది. 52.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఢిల్లీలోని ముంగేష్‌పూర్‌లో మొదట రికార్డ్ బద్దలు అని భావించారు. సెన్సార్ లోపం కారణంగా దాదాపు 3సెంటీగ్రేడ్ చాలా ఎక్కువగా ఉంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలో వాతావరణ మార్పుల కారణంగా తీవ్రమైన వేడికి గురయ్యే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. 2000-2004, 2017-2021 మధ్య 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులలో వేడి, సంబంధిత మరణాలు సుమారుగా 85 శాతం పెరిగాయి.

ప్రశ్న: ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

సమాధానం: భారతదేశం ప్రతిష్టాత్మకమైన 2030 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని వాతావరణ చర్య ప్రయత్నాలకు రాబోయే ఐదు సంవత్సరాలు చాలా కీలకం. వేడి ఒత్తిడిని తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, వ్యర్థాలను నిర్వహించడం, శక్తి సామర్థ్యాన్ని పెంచడం వంటి ముఖ్యమైన పర్యావరణ సమస్యలు తక్షణ శ్రద్ధ అవసరం. శక్తి కోసం పెరుగుతున్న డిమాండ్‌ను సమీప కాలంలో ఈ సవాళ్లను పరిష్కరించే సమగ్ర విధానాలతో వెళ్లాలి.

ప్రశ్న: కాలుష్య కారకాలను తగ్గించడం ఎలా?

సమాధానం: భారతదేశం వేడి ఒత్తిడికి ఎక్కువగా గురవుతోంది. త్వరలో మానవ మనుగడ పరిమితులను మించి వేడి తరంగాలను ఎదుర్కోవచ్చు. సివో2 ఉద్గారాలు, మీథేన్, బ్లాక్ కార్బన్, హైడ్రోఫ్లోరో కార్బన్‌ల వంటి స్వల్పకాలిక సూపర్ కాలుష్య కారకాలు రెండింటినీ తగ్గించడం చాలా కీలకం. ఈ సూపర్ కాలుష్య కారకాలు, ముఖ్యంగా మీథేన్, గ్లోబల్ వార్మింగ్‌కు గణనీయంగా దోహదపడతాయి. తక్కువ వ్యవధిలో సిఒ2 కంటే ఎక్కువ వేడిని ట్రాప్ చేస్తాయి. వాటిని తగ్గించడం సిఒ2ను మాత్రమే తగ్గించడం కంటే సమీప కాల వేడెక్కడాన్ని నిరోధించవచ్చు. పర్యావరణపరంగా మెరుగైన పరిస్థితి, స్థిరమైన వస్త్రాలు, వంటి మరిన్ని హరిత కార్యక్రమాలు నిర్వహించాలి. దుస్తులు, హరిత నిర్మాణం, ఈ-వ్యర్థాల నిర్వహణ, సౌర పవన శక్తి, బయో ఇంధనం, ఈ సమస్యను తగ్గించడానికి శక్తి, హైడ్రోజన్ శక్తి అవసరం.

ఆచార్య బి దేవప్రసాదరాజుకు ఘన సన్మానం




ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాద్‌రాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగాధిపతిగా నూతనం గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య బి దేవ ప్రసాద్ రాజును నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్ విజయభాస్కరరావు ఆ విభాగంలో ఘనంగా దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఫిజిక్స్ విభాగాధిపతిగా ఆచార్య దేవ ప్రసాదరాజు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విసి ఆచార్య విజయభాస్కరరావు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విభాగాధిపతి ఆచార్య ఆర్పీ విజయలక్ష్మి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుండి రేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఏపీ ప్రజలకు సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించనుంది.ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు ఇతర సర్వీసులకు కూడా అవకాశం కల్పించనుంది. డిసెంబర్ 2 నుంచి 28వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇందుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనుంది. మార్పులు, చేర్పులు చేసిన కార్డులు, కొత్త కార్డులన్నింటినీ.. సంక్రాంతి 2025 కానుకగా లబ్ధి దారులకు అందించేలా ప్లాన్ చేసింది. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వక పోవడంతో.. కొత్తగా పెళ్లిళ్లు అయినవారు, రాజకీయాల కారణాలతో రేషన్ కార్డులు రానివారు వేల సంఖ్యలో ఎదురుచూస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు, కార్డుల్లో మార్పులు, సభ్యుల తొలగింపు. వంటి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. కొత్త దరఖాస్తులతో పాటు వీటిని కూడా పరిశీలించి కొత్త రేషన్ కార్డులను అందించనుంది.

ఉన్నత విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



ప్రజాశక్తి - క్యాంపస్ : ఉన్నత విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబిఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వైవి రామిరెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు వంటి ఉన్నత విద్యాసంస్థలలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆచార్య వైవి రామిరెడ్డి ఢిల్లీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వైస్ ఛైర్మన్, ఐసిఎస్ఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ప్రొఫెసర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల స్థానాలను భర్తీ చేయాలని, రాష్ట్రంలోని మొత్తం 17 విశ్వవిద్యాలయాలకు పూర్తి సమయం ఉప కులపతులను నియమించాలని, రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న పరిశోధక విద్యార్థులకూ యుజిసి , ఐసిఎస్-ఎస్ఆర్, ఐసిహెచ్ఆర్, డిఎస్టి వంటి సంస్థల ఇస్తున్న ఉపకార వేతనాలను కేంద్ర విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులతో సమానంగా కేటాయించాలని కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌కు ప్రస్తుతం వున్న 12 సంవత్సరాల సర్వీసును 9 సంవత్సరాలకు కుదించాలని, నూతన జాతీయ విద్యా విధానంపై అధ్యాపకులకు సరైన అవగాహనకల్పించే విధంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. స్పందించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వైస్ ఛైర్మన్, ఐసి ఎస్ఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ప్రొఫెసర్ శ్రీ వాత్సవ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డాక్టర్ సి.ఆర్ రెడ్డి ఆసుపత్రి నందు ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ప్రగతి సేవా సంస్థ , ఇన్నర్ వీల్, ఆంధ్ర మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 30 మందికి పౌష్టికాహారాన్ని డాక్టర్ జనార్ధన్ రెడ్డి , డాక్టర్ రోహిణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ సభ్యులు కడివేటి చంద్రశేఖర్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు డాక్టర్ తనూజ, అనిత , విష్ణు వందన పాల్గొన్నారు.

ఘనంగా నిప్పో 99వ ఫౌండేషన్ వేడుకలు



నిప్పో ఫౌండేషన్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తడ: తడ మండలం లోని నిప్పో ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం పరిశ్రమ వ్యవస్థాపకుడు శ్రీ పొట్టిపాటి ఓబుల్ రెడ్డి 99 వ జయంతి సందర్భంగా వ్యవస్థాపకుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1970 లో చిన్న ఆలోచనతో మంచి నాణ్యత గల ఉత్పత్తులను అందించాలనే ప్రారంభమైన నిప్పో కంపెనీ ఈ రోజు గొప్ప బ్రాండ్ గా ఎదగడానికి ఓబుల్ రెడ్డి పాత్ర ఎంతో ముఖ్యమైందని కంపెనీ సీఈఓ పవన్‌కుమార్ అన్నారు. అనంతరం ప్లాంట్ హెడ్ బి నాగరాజు మాట్లాడుతూ ఓబుల్ రెడ్డి కృషిని కొనియాడారు. కంపెనీ ఎన్నో విజయాలను సాధించిందని చెప్తూ ప్రస్తుతం ఉన్న సవాళ్లు గురించి వివరించారు. కంపెనీ ఉత్పత్తి చేసే అన్ని బ్యాటరీలు వినియోగదారులు ఉపయోగించిన తర్వాత సేకరించి రీసైక్లింగ్ చేయడం చాలా అవసరం అన్నారు. అనంతరం కార్మికులు, వారి పిల్లలకు నిర్వహించిన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ హెడ్ బి నాగరాజు, హెచ్ఆర్‌హెడ్ రమేష్, క్వాలిటీ హెడ్ షణ్ముగమణి, ఎలక్ట్రికల్ హెడ్ శంకర్ బాబు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై పద్మావతీ దేవి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజగోపాలస్వామివారి అలంకారంలో చంద్రకోలు, దండం ధరించి పద్మావతి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, జీయంగార్ల గోష్ఠితో అమ్మవారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ, చిరుజల్లుల మధ్య వాహనసేవ కోలాహలంగా సాగింది. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈఓ జె.శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, అర్చకులు బాబుస్వామి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రజాశక్తి- తడ: తడ మండలం లోని కాదలూరు గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ ఆదివారం పర్యటించారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసింది. వరద నీరు భారీగా రావడంతో చెరువులు నిండి పంట పొలాల్లోకి చేరి గ్రామంలోకి రావడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు తడ మండల ఎంపిడిఓ విజయ్ కుమార్, టీడీపీ నాయకులు చంద్రయ్య, అధికారులు, నాయకులు ఆ గ్రామాన్ని పరిశీలించారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్ లోని తైక్వాండో ట్రైనింగ్ సెంటర్ లో ఆదివారం విద్యార్థి ని విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. ఎల్లో, ఎల్లో-1, గ్రీన్, గ్రీన్-1, బ్లూ, బ్లూ-1, రెడ్ క్యాటగిరీలలో బెల్ట్ టెస్ట్ నిర్వహించగా పలువురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ అనుపమ హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు వివిధ కలర్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తైక్వాండో అనేది ఒక క్రీడ మాత్రమే కాదని మహిళలకు, బాలికలకు ఆత్మ రక్షణగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెడుతున్న నూతన స్పోర్ట్స్ పాలసీకి అనుగుణంగా ప్రతి ఒక్కరు జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బెల్ట్ పరీక్షలు నిర్వహించిన మాస్టర్ గోపి నాయుడు, ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ గీత, శిక్షకులు భవిష్య, సంజన పాల్గొన్నారు.

టోకెన్లు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల్లోని ప్రజలకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్నారని భక్తులందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధితోపాటుగా ప్రజలలో ఆధ్యాత్మికతను పెంపొందించే ఆలోచనతో ఈ చర్యలు చేపట్టామన్నారు. తిరుమల శ్రీవారి దర్శనం కల్పించేందుకు సోమవారం ఉదయం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు మహతి ఆడిటోరియంలో టోకెన్లు జారీ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొచ్చి టోకెన్లను పొందవచ్చని తెలిపారు. చంద్రగిరి ప్రజలకు దర్శనం కల్పించడం గొప్ప విషయమని, సహకరించిన టీటీడీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

చెవిరెడ్డిపై పోక్సో కేసులో ఊహించని ట్విస్ట్

- ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు
- పిలిస్తే వచ్చిన చెవిరెడ్డిపై కేసు ఎందుకు పెడతాను?
- మీడియా సమావేశంలో బాలిక తండ్రి వెల్లడి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఐదు రోజుల క్రితం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిపై పోలీసులు పెట్టిన పోక్సో కేసులో ఊహించని ట్విస్ట్ ఎదురైంది. తమ కూతురిపై అత్యాచారం జరగకుండానే జరిగిందని తప్పుడు ప్రచారం చేసి, తమ కుటుంబ పరువుకు భంగం కలిగించారని ఆ బాలిక తండ్రి ఫిర్యాదు చేయగా కేసు పెట్టినట్టు పోలీసులు ఇది వరకే స్పష్టం చేశారు. అయితే తాము ఎవ్వరి మీద పోలీసులకు ఫిర్యాదు చేయలేదని, నా బిడ్డకు అన్యాయం జరిగిందని తానే చెవిరెడ్డికి ఫోన్ చేసి పిలిచానని, తన బిడ్డను చూసి ధైర్యం చెప్పడానికి వచ్చిన చెవిరెడ్డిపై తాను ఎందుకు కేసు పెడతాను?' అంటూ యల్లమంద ఘటనలో బాధితురాలైన బాలిక తండ్రి రమణ పేర్కొన్నారు.

చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారిపాళెం మండలం యల్లమంద నుంచి తిరుపతికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, వైసీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డిలతో కలసి ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తమ బిడ్డకు అన్యాయం జరిగిందని, మీరు రావాలని చెవిరెడ్డి అన్నను పిలిస్తేనే యల్లమంద ఆసుపత్రికి వచ్చాడన్నారు. ఆయన వచ్చిన వెంటనే ఏం జరిగిందని తనను అడుగగా అప్పటికే తనకు పాప చెప్పిన విషయాలు అన్నీ వివరించాను. ఆ తర్వాత పాపను చూడటానికి ఆసుపత్రిలోకి వెళ్లగా ఓ గదిలో పాపను బంధించి పోలీసులు గుచ్చిగుచ్చి అడుగుతుండగా చెవిరెడ్డి అన్న వారితో మహిళా పోలీసు లేకుండా మీరు ఎలా విచారిస్తారు?' అని అడుగుతూ పాపకు ధైర్యం చెప్పి బయటకు వచ్చారన్నారు. చెవిరెడ్డితో పాటు మేమందరూ బయటకు వచ్చేశామని, ఆ తర్వాత నేను పాప మీద జరిగిన దాడి గురించి మీడియా వాళ్లకు చెబుతుంటే చెవిరెడ్డి ఒకసారి ఆలోచించుకుని చెప్పు..భవిష్యత్తులో పాపకు ఇబ్బంది వస్తుందెమో అని అన్నాడన్నారు. తన బిడ్డపై బిడ్డ శరీరం మీద గాయాలు చూసిన తర్వాత ఇంతకన్నా మాకు జరిగే నష్టం ఏముంటాది, ఇంతకు తెగించిన వారిని ఉరి తీయాలని నేనే మీడియాకు జరిగినదంతా చెప్పానన్నారు. తన బిడ్డకు మంచి వైద్యం అందించేందుకు, నాకు సహాయం చేసి అండగా నిలిచేందుకు వచ్చిన చెవిరెడ్డి పై నేనేందుకు కేసు పెడతాను?' అని ప్రశ్నించాడు. పోలీసులు ఉద్దేశ పూర్వకంగానే దురుద్దేశంతో ఆయనపై కేసు పెట్టారన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల వైసిపి అధ్యక్షులు భూమన కారుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళను రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తన భార్య మనస్తత్వంతో ఆత్మహత్యకు పాల్పడుతుందని వెంటనే కాపాడాలని ఓ భర్త పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన పోలీసులు ఆమె ప్రాణాల్ని కాపాడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోలీస్ కమాండ్ కంట్రోల్ కి ఫోన్ చేసి తన భార్య తనతో గొడవపడి గొడవపడి వినుకొండ నుండి తిరుపతి వచ్చేసినట్లు, 1 వ తేదీ , 2:40 నిముషాల ప్రాంతంలో విష్ణునివాసం , తిరుపతి నుండి తనకు కాల్ చేసి తను రైల్వేస్టేషన్‌కి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి కాల్ కట్ చేసిందని సమాచారం అందిందని తెలిపి తన భార్య ప్రాణాలు కాపాడాలని కోరాడు. వెంటనే ఎస్పీ ఆదేశాల మేరకు మహిళ ఫొటోలు, ఆధారాలను సేకరించి విష్ణునివాసం , రైల్వే స్టేషన్ పరిసరప్రాంతాలలో ఫొటో ఆధారంగా హుటాహుటీన క్షుణ్ణంగా వెతకాలని మహిళా రక్షక్, బ్లూకోల్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కమాండ్ కంట్రోల్ సమాచారం పై మహిళా రక్షక్, బ్లూకోట్స్ సిబ్బంది హుటాహుటిన విష్ణు నివాసం, రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ లో పై అణువణువు క్షుణ్ణంగా వెతుకుతూ ఉండగా రైల్వే స్టేషన్ చివర ప్లాట్‌ఫామ్ ట్రాక్ వద్ద మహిళలను కనుగొన్నారు. మహిళకు ఆహార పానీయాలు అందించి కౌన్సెలింగ్ ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు.కమాండ్ కంట్రోల్ సిబ్బంది స్పందించి వెంట వెంటనే సమాచారాలు సేకరించి సత్వర చర్యలు తీసుకోవడం వల్ల మహిళ ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం పోలీసుల సంరక్షణలో ఉన్నారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులను ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు అభినందించారు. క్షణికావేశంలో తొందరపాటుతో ఏ నిర్ణయం తీసుకోకూడదని సూచించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి కలెక్టర్ రాక

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరిస్తోంది. ఈ నేపథ్యంలోనే సూళ్లూరుపేట డివిజన్ స్థాయిలో డిసెంబర్ 2న సోమవారం సూళ్లూరుపేట లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో జరగనున్నట్లు దొరవారిసత్రం తహశీల్దారు శైలకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సమస్యలు ఉన్న ప్రజలందరూ తమ ఫిర్యాదులను సూళ్లూరుపేట లోని సత్య సాయి కళ్యాణ మండపంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వారి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లొచ్చని ఆమె తెలిపారు. ప్రతి సమస్య ఉన్న ఫిర్యాదుదారుడు దొరవారిసత్రం తమశీల్దారు కార్యాలయానికి రాకుండా సూళ్లూరుపేటకు వెళ్లాలని ముందే తెలిపారు.

ఏటీఎం ధ్వంసం

మతి లేని వ్యక్తి నిర్వాకం



ధ్వంసమైన ఏటీఎం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి కొత్తపేటలోని ఇండియన్ బ్యాంక్ ఎటిఎంను మతిస్థిమితం లేని వ్యక్తి ధ్వంసం చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు ఓ మతిస్థిమితం లేని వ్యక్తి ఉదయం 11 గంటల సమయంలో సైకిల్ మీద వస్తూ స్థానిక ఇండియన్ బ్యాంక్ ఎటిఎం వద్ద ఆపాడు. సైకిల్ ని పక్కకు ఆపి రెండు పెద్ద రాళ్లను తీసుకుని ఏటీఎం అద్దాలను, మిషన్ ను ధ్వంసం చేశాడు. వెంటనే అలారం మోగడంతో స్థానికులు అక్కడికి చేరుకుని ప్రతిఘటించారు. మతిస్థిమితం లేని ఆవ్యక్తి నేను గాంధీని.. నన్ను కావాలంటే కాల్చేయండి..చంపేయండి..' అంటూ కేకలు పెట్టడంతో స్థానికులు వదిలిపెట్టేశారు. సమాచారం అందుకున్న బ్యాంక్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని అలారం ఆఫ్ చేసి మిషన్‌ను పరిశీలించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానవ హక్కులను కాపాడండి

వక్తల పిలుపు

ప్రజాశక్తి - క్యాంపస్ : నేటి ఆధునిక సమాజంలో మానవ హక్కులను కాపాడండి..' అంటూ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ఎస్వీయూలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాయలసీమ జోనల్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఐహెచ్‌ఆర్‌పిసి ఫౌండర్ అండ్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ముజాహిద్, ఐ హెచ్ ఆర్ పి సి ఛైర్మన్ డాక్టర్ సోహెబ్, జనరల్ సెక్రటరీ ప్రశాంతి, నేషనల్ ఇన్‌ఛార్జ్ శోభ రాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐహెచ్‌ఆర్పిసి జోనల్ మీటింగ్ సందర్భంగా ఇండియన్ ప్రైడ్ రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఐహెచ్‌ఆర్ పిసి న్యూ జాయినింగ్ మెంబర్స్ కి ఐడి కార్డ్స్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ మిగతా అతిథుల చేతుల మీదుగా అందించారు. భారతదేశం వ్యాప్తంగా ఆడపిల్లల పై అత్యాచారాల గురించి ముఖ్యంగా చర్చించామన్నారు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అత్యాచారానికి పాల్పడిన దోషులను చట్టరీత్యా ఎలాంటి శిక్షలకి వాళ్ళ అర్హులు, ఏ విధంగా వాళ్ళని శిక్షించాలని చర్చలు నిర్వహించారు. ఈ మేరకు ఇలాంటి వాటిపైన ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొని రావాలని ఇలాంటి సమస్యలను జరగకుండా చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున దీని గురించి నిరసనలు తెలుపుతామని వివరించారు. ఈ ఒక్క విషయం మీదే కాదు ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు, వాళ్లందరూ పక్షాన కూడా ఐ హెచ్ ఆర్‌పిసి టీం ప్రజల పక్షాన ఉండి పోరాడుతామని వాళ్లకి తగిన న్యాయం జరిగే వరకు దీని కోసం కృషి చేస్తామని తెలిపారు. మీటింగ్‌కి హాజరైన అతిథులకు ఐహెచ్‌ఆర్ పిసి ఎనిమిది జిల్లాల మెంబర్స్ కి ముఖ్యంగా తిరుపతి జిల్లా టీం సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, సునీల్, అరుణ్, రవి, మహేష్, మణికంత, బాలసుబ్రమణ్యం, గిరీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యం బలోపేతానికి ఐఎంఏ సహకారం



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు గార్లపాటి నందకిషోర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యం బలోపేతం చేయడానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తన వంతు సహకారాన్ని అందించి పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థను రూపొందించడానికి ప్రణాళికలు చేస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఎంఏకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖలో 22 వేలమంది సభ్యులు ఉన్నారని, 26 జిల్లాలలో 99 శాఖలుగా ప్రజారోగ్య పటిష్టతకు పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో నాలుగు గ్రామాలను ఐఎంఏ దత్తత తీసుకొని అక్కడి ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. గ్రామీణ వాతావరణం లో ఉండే ప్రజలు పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండేవారని, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలు రక్తహీనతతో, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ప్రమాదం పొంచి ఉందన్నారు. ఫార్మసీలలో పనిచేసే ఫార్మసిస్టులు అసిస్టెంట్లకు యాంటీ బయాటిక్ వినియోగాలపై శాస్త్రీయ అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రభుత్వం కూడా వైద్యులకు తగిన సహకారాన్ని అందించాలని, విద్యుత్ చార్జీలు కమర్షియల్ గా వసూలు చేయడం, భవన ఆస్తి పన్నులలో, మందులపై, వైద్య పరికరాలపై జీఎస్టీ శాతాన్ని తగ్గించడంతో వైద్యం భారం కాదన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్యులపై దాడులకు సంబంధించి 2008లో తీసుకువచ్చిన చట్టంలో కొద్దిపాటి సవరణలు చేసి పటిష్టంగా అమలు చేస్తే వైద్యులపై దాడులు జరగవన్నారు. ఈ సమావేశంలో ఐఎంఏ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, ఐఎంఏ ప్రతినిధులు టి.జనార్ధన్, ఏఆర్ రెడ్డి, సేవకుమార్, శ్యాం బాబు, రెడ్డప్ప పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి వుండాలి



గూడూరు లో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజలందరూ హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని, ఐసీటీసీ కేంద్రంలో ఈ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, గోప్యంగా ఉంచుతారని, గూడూరు ఐసీటీసీ కౌన్సిలర్ పీవి విజయకుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థల సభ్యులతో కలిసి పట్టణంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం టవర్ క్లాక్ కూడలి వద్ద ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్వకెట్లు అరవ పార్వతయ్య, మహబూబ్ బాష, ల్యాబ్ టెక్నీషియన్ జయలక్ష్మి, డిఎస్ఆర్‌సి కౌన్సిలర్ రామాంజనేయులు, కామెల్, సార్డ్స్ ప్రతినిధులు సుహాసిని, జయచంద్ర పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ , పుత్తూరు వైద్య అధికారి డాక్టర్ కృష్ణ కాంత్, సర్వ్ ట్రైన్ ఎడ్యుకేట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు అశోక్ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, హెచ్ఐవి బాధితులను వివక్షతో చూడకూడదన్నారు. ఎన్జీవో ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్ ఆర్ముగం మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ- పుత్తూరు కౌన్సిలర్ చెంచమ్మ, స్టెప్స్ ఏఎన్ఎం వి సుమ, ఔట్రీచ్ వర్కర్లు, భువనేశ్వరి, అరుణ లత, ఆరుళ్, ఇంధుమతి, ఎడ్యుకేటర్ లావణ్య , నిర్మల సింధుజ, నరేష్, దివ్య, ప్రియ, పుత్తూరు ప్రభుత్వ ఆరోగ్య సేవా సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి సహకారంతో ఎయిడ్స్ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ యు శ్రీహరి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఏఆర్ టీ మందులు వాడితే హెచ్ఐవి సోకినప్పటికీ జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చని తెలిపారు. హెచ్ఐవి సోకినవారు క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఇచ్చే మందులు వాడాలని సూచించారు. ఎస్‌విఆర్‌ఆర్‌జిజి హెచ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ టేక్ ద రైట్స్ పాత్ అంటే,కమ్యూనిటీ అందరూ వారి హక్కులు మార్గం ఎంచుకోవాలన్నారు. కమ్యూనిటీ అందరూ కూడా నియంత్రణ పద్ధతులు పాటించి హెచ్ఐవి వ్యక్తిని అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా నెట్వర్క్ ప్రెసిడెంట్ రమేష్, ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టరు చంద్రశేఖర్, రెడ్డప్ప, వారి కళాబృందం డప్పుకొడుతూ పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి శ్రీనివాసరావు డిపిఎమ్‌ఓ, డాక్టర్ రూప్ కుమార్ డిస్టిక్ మలేరియా ఆఫీసర్, మోహన్ కుమార్ సీఈవో సెట్విన్, డాక్టర్ ఆనందరావు ఏ ఆర్టి మెడికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారం అందించాలి..



తనిఖీ చేస్తున్న బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారాన్ని అందించాలనీ, భోజన నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని కాసాగార్డెన్ బాలికల గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి బాలికలు కందుతున్న మౌలిక వసతులు, పౌష్టికాహారం పై ఆరా తీశారు. వసతులు, భోజన నాణ్యతపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గురుకులాలతోపాటు, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కట్టుబడి ఉన్నారనీ, ఇప్పటికే తన సొంత నిధులతో పలు హాస్టళ్లను బాగు చేశారని గుర్తు చేశారు. టిడిపి నేత కన్నలి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆధిపత్య పోరు కోసమే హత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆధిపత్యం కోసమే హిజ్రా హాసినిని హత్య చేశారని నెల్లూరు ఎస్పీ కృష్ణ కాంత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన మాణికుల హాసిని అనే హిజ్రా నాయకురాలు, విడవలూరు మండలం, పార్లపల్లి గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టకు వెళ్లి వస్తుండగా రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో టపాతోపు రైల్వే అండర్ పాస్ వద్ద హాసిని ప్రయాణించే కారుకు ముందు వెనుక రెండు కార్లు అడ్డంపెట్టి ఆపి, కత్తులు గొడ్డళ్లతో దాడి చేసి చంపారు. మృతురాలు మాణికల హాసిని దక్షిణ కోస్తా, రాయలసీమ, బళ్లారి రాయచూరు, దర్వాడ్, చికమంగళూరు, హుబ్లీ జిల్లాల ట్రాన్స్ జెండర్స్‌కు నాయకురాలుగా ఉన్నారు, గతంలో హిజ్రాలకు నాయకురాలుగా వున్న అలేఖ్య, హాసిని మధ్య ఎన్నోసార్లు ఘర్షణలు జరిగి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల లో కేసులు నమోదయి వున్నాయన్నారు. ఇదే క్రమంలో హాసినికి సులోచన, షీలా అనే ట్రాన్స్ జెండర్‌లతో కూడా విభేదాలు తీవ్రస్థాయికి చేరాయని అలేఖ్య, సులోచన, షీలాలు కలిసి హాసినిని చంపాలని ప్రణాళిక వేశారన్నారు. భూపతి అనే రౌడీషీటర్ మరి కొంతమంది సహాయం తీసుకుని వ్యూహం ప్రకారం ముందుగా రెక్కీ నిర్వహించి హాసిని ప్రయాణించే కారును అడ్డగించి దాడి చేసి హత్య చేశారని తెలిపారు. ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న 15 మందిలో 12 మందిని అదుపులోకి తీసుకున్నామని, మిగతా వారిని కూడా తొందరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. ఈ హత్య కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన నెల్లూరు రూరల్ డిఎస్పి జి శ్రీనివాస్ రావు, కొడవలూరు సిఐ సురేంద్రబాబుతో పాటు పోలీస్ సిబ్బందికి ఎస్‌పి కృష్ణకాంత్ అభినందించి రివార్డులు అందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -కోట : కోట మండలం సిద్దవరం గ్రామానికి చెందిన రాయపు సుధాకర్(49) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గ్రామస్థుల కథనం మేరకు శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి తిరిగి రాకపోవడంతో రాత్రంతా వెతికినా కనపడలేదు. ఆదివారం ఆ ఊరిలో ఉండే వైన్ షాపు వద్ద అనుమానంగా మృతి చెందినట్లు ఆదివారం స్థానిక గ్రామస్తులు గుర్తించారు.అనంతరం కోట పోలీసులుకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలంలోని , తిరుపతి - చిత్తూరు జాతీయ రహదారిలో ఐతేపల్లి వద్ద శనివారం పాల ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శనివారం మధ్యాహ్నం మధ్యాహ్నం సుమారు 1 గంటలకు చిత్తూరు నుండి తిరుపతి వైపు వస్తున్న మిల్క్ టాంకర్ ఐతేపల్లి వద్ద రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని మిల్క్ టాంకర్ డీకొనడంతో అతనికి తలకి దెబ్బలు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లారు, హైవే అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయా హాస్పిటల్‌లో చేర్పించి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. రుయా హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆ గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం ఉదయం ఉదయం 9 గంటల ప్రాంతంలో చనిపోయారు. వివరాలు తెలిసిన వారు చంద్రగిరి పోలీసులకు తెలపాలని సిఐ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసినవారు సీఐ - 9440796760, ఎస్ఐ 9440900720 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

జిల్లా మహాసభలకు తరలిన సిపిఎం శ్రేణులు



సిపిఎం జిల్లా మహాసభకు తరలి వెళుతున్న నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సత్యవేడులో నిర్వహిస్తున్న సిపిఎం 14 వ జిల్లా మహా సభలకు గూడూరు నుండి సీపీఎం, సిఐటియు అనుబంధ సంఘాల నాయకు లు తరలి వెళ్లారు. 55 మంది సభ్యులు బస్సులో బయలు దేరివెళ్లారు. సిపిఎం సీనియర్ నాయకులు వెంకటరామి రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సిపిఎం ఆర్గనైజర్ జోగి శివ కుమార్, సిఐటియు నాయకులు శ్రీనివాసులు , సురేష్ , ఆడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా బృందాల ప్రదర్శన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనసేవలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాలు అద్భుత ప్రదర్శనలిచ్చారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 10 కళాబృందాలు, 238 మంది కళాకారులు పాల్గొని తమ సంగీత నృత్య ప్రదర్శనలతో భక్తులను పరవసింప చేశారు. చిరుజల్లుల మధ్య ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు నవదుర్గల వేషధారణ, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. కర్ణాటకకు చెందిన 27 మంది కళాకారులు క్షీరసాగర మథనం, వివిధ పౌరాణిక పాత్రలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. నెమలి నృత్యం, కుండల నృత్యం, కడప డ్రమ్స్, కోలాటాలు నయనానందకరంగా సాగింది.

కుప్పకూలిన సెల్ టవర్

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఫెంగల్ తుపాను కారణంగా ఉపయోగంలోలేని సెల్ టవర్ ఆదివారం కుప్ప కూలింది. అయితే ఆ సమయంలో సంచారం లేకపోవడంతో పేరు ప్రమాదం తప్పింది. పట్టణంలోని భాస్కర్ పేటలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం పక్కన ఉపయోగంలో లేని సెల్ టవర్ ఉంది. పెంగల్ తుపాన్ వల్ల ఆదివారం ఒక్కసారిగా కుప్ప కూలి ఆరోగ్య కేంద్రంపై పడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆరోగ్య కేంద్రం పక్కనే మున్సిపల్ హై స్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడి స్కూల్ లు ఉన్నాయి. అయితే సెలవు రోజున సెల్ టవర్ కుప్పకూలడంతో ప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వంతెన నిర్మించండి : కాంగ్రెస్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని శ్రీకాళహస్తి-కాళంగి ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న చిట్టత్తూరు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన చిట్టత్తూరు వాగు వద్ద కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వర్షాలు పడ్డ ప్రతిసారీ చిట్టితూరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోందని, ఫలితంగా కాలువకు అవతల వైపు ఉన్న 20 గ్రామాల ప్రజలకు శ్రీకాళహస్తి పట్టణముతో సంబంధాలు తెగిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వాగుపై ఏర్పాటు చేసిన కల్వర్టు ఎత్తు లేకపోవడమే దీనికి కారణమని మండిపడ్డారు. దాదాపు 50 ఏళ్లుగా ఈ కాలువపై వంతెన నిర్మించాలని బాధిత గ్రామాల ప్రజలు పాలకులను, అధికారులను వేడుకుంటున్నా ప్రయోజనం శూన్యం అని వాపోయారు. కాజ్ వేపై నీరు ఉప్పొంగే సమయంలో వాగును దాటె సాహసం చేస్తున్న ఎంతోమంది అమాయకులు ప్రమాద ఉధృతికి కొట్టుకుపోయారనీ, పలువురు మృతి చెందారని గుర్తు చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి చిట్టత్తూరు వాగుపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు నానీ, కరీముల్లా, మునిరాజా, వేలు, ధన కుమార్, నవీన్, శశి కుమార్, ధనుష్, ఉదయ్, రవి రెడ్డి పాల్గొన్నారు.